కథ

# తిరగబడిన కెరటాలు

గుత్తుల భాస్కరరావు

అది-

గుమ్మంలో నిల్చుంటే సముద్రం సాంతం కనబడే పెద్ద బంగళా!

ఉప్పుగాలి తగిలి తుప్పుపట్టిన పాత బంగళా. పెచ్చులూడిన దృఢంగా ఉన్న గోడలు... బీటలు తీసి నాచుపట్టిన పైకప్పు, హాల్లో పరిచిన పాతకాలం తివాచీ... రంగు వెలిసిన సోఫాలు... తెల్లబోయిన తైలవర్ణ చిత్రాలు... చిరకాలంగా వాడుకలో లేని షాండిలీర్లు... ఎత్తైనచెట్లు పేరు తెలీని గుబురు మొక్కలు పడుగు పేకల్లా బంగళా చుట్టూ అల్లుకున్న పిచ్చిలతలు... చుట్టూ ఆవరించి - అలా కొన్నాళ్లుంటే... మధుమతి లేకుండా ఉంటే ఖచ్చితంగా భూత్ బంగళా అయి వుండేది.



నెరిసినా.... అందమైన ముంగురుల్ని వెనక్కి తోసుకుని వంగిపోయిన రెయిలింగ్‌ని ఆనుకుని మధుమతి తదేకంగా... అనంతంగా కనిపిస్తున్న సముద్రం వంక చూస్తూంది. ఉదయించి అప్పుడే పైపైకి లేస్తున్న సూర్యుడి లేత బంగారు కిరణాలు... క్రమేపీ రంగుమారి కెరటాల్ని వెండి మలామా చేస్తున్నాయి.

ఎదురుగా ఉగ్రరూపంలో... వక్రరేఖల్లాంటి కెరటాలు దూరం వెళ్లే కొద్దీ చిట్ట చివర సముద్రం సరళ రేఖలా మారి ఆకాశాన్ని అనుసంధానం చేస్తుంది. నింగీ నీరూ కలిసేచోట దృష్టి నిలిపి అవతలి తీరం చూడాలని నిరంతరాన్వేషణ చేస్తుందా అనిపిస్తుంది... మధుమతి. ఆమె తరచి చూసే కొద్దీ నిమిషాలు... గంటలూ దొర్లిపోయాయి. కాళ్లకి కళ్లకి అలసటలేకుండా నిలబడి చూస్తూనే ఉంది. ఆమె దిన చర్యలో ఎక్కువభాగం - ఎరీనాలో ఎంటరయిన ఓడల వంక... తిరుగు ప్రయాణంలో కనుమరగయ్యే ఓడల వంక తదేకంగా చూడ్డమే.

ఉదయం పదిగంటలయింది.

బంగళాముందు ఎండలో మెరుస్తూ పాత ఫియట్ కారు వచ్చి ఆగింది. మధుమతి 'ఎవరూ?' అన్నట్టు తేరిపార చూసింది. ఆశ్చర్యపోయింది. అతనే!

భరత్‌బాబు... తనలాగే ఫిఫ్టీ ప్లస్! ఒక్కరోజు టూరిస్టు పరిచయానికే వెంపర్లాడి తనని వెతుక్కుంటూ ఇంటికి వచ్చేసాడు. పత్రికల్లో బిజినెస్ కాలమ్స్ రాస్తుంటాడు. సన్నకారు బిజినెస్‌మాన్ కూడా.

కారు దిగి ఆమె ముందు నిలబడి విష్ చేసాడు. అతని చేతిలో అప్పుడే తుంచి కట్టిన తాజా రోజాల బుకే నుండి మంచుబిందువులు జాలు వారుతున్నాయి. అందించి అభినందన పూర్వకంగా నవ్వాడు.

'థాంక్యూ' అందామె. ''మా వారికి గులాబీలంటే ఇష్టం. బెంగళూరు నర్సరీల నుంచి ఎన్నో రకాలు రంగులు తెప్పించి నాటించారు. ఉప్పు గాలి వల్లో ఏమో - ఒక మొక్కా బతికి బట్టకట్టలేదు'' అంది నిట్టూరుస్తూ.

'అలాగా' అని అతను తల పంకించాడు.

''ఈ పుష్పగుచ్ఛంలోని స్వచ్ఛత మీ మనసులో ఉంటుందని అనుకోవచ్చా?'' అంది.

''వై నాట్ మధుమతి గారూ. అయాం ఏ ట్రూ జంటిల్‌మన్'' అన్నాడు.

''ఇల్లు తేలిగ్గా కనుక్కున్నారా?''

''ఏముంది. మీ బంగళా కేరాఫ్ బే ఆఫ్ బెంగాల్ కదా'' అన్నాడు బిగ్గరగా నవ్వుతూ.

అతన్ని లోపలికి తీసుకెళ్లింది. సోఫాల్లో కూర్చుంటే...

హాల్లో తెల్లబనీను ఖాకీ నిక్కర్లో టక్ చేసుకున్న గుబురు మీసాల వృద్ధుడు ఎదురయ్యాడు. ''రాంసింగ్. ఈయన భరత్‌బాబు గారు. మన అతిథి. లెమన్ టీ చేసి తీసుకురా'' అంది.

''అలాగేనమ్మా'' అన్నాడు.

''ఏం తీసుకుంటారని అడక్కుండా లెమన్ టీ చెప్పాను. ఏమీ అనుకోరు కదా. మా వారికి లెమన్ టీ ఇష్టం'' అంది.

మధుమతి మాటమాటకీ ప్రతీ వాక్యంలో ప్రస్తావించి... ప్రస్తుతించే 'ఆయన' కోసం చూపులు సారించి చూసాడు. ఆయన జాడ లేకపోగా గోడ మీద ఫొటో అయినా లేదు.

''ఏమిటి చూస్తున్నారు?'' అంది గులాబీ రంగు అరిచేతులతో మొహం రుద్దుకుంటూ.

''ఆయనెక్కడున్నారు?''

''లేరు. ఉంటే పరిచయం చెయ్యనా?''

''షిప్ మీద ఉన్నారా? డ్యూటీ ఎన్నాళ్లు ఉంటుంది. ఎప్పుడు తిరిగి వస్తారు?''

''ఆర్నెలు సముద్రం – ఆర్నెలు భూమ్మీద. మెరైన్ బతుకులు. మా మేనత్త నా చిన్నప్పుడు బుగ్గలు చిదిమి వేళాకోళామాడేది. 'చేసుకుంటే కొంగున ముడేసుకుని నీతోనే ఉంచుకునే మొగుణ్ని చేసుకోవే' అని. ఊ. ఆ అదృష్టం లేక పోయింది''.

''రావుగారు ఎప్పుడొస్తారు?'' క్యూరియాసిటీ కొద్దీ అడిగాడు.

''ఈ సమాచారం మీకవసరమా?'' అంది చివుక్కున.



అతను ముల్లు గుచ్చుకున్నట్టు నొచ్చుకున్నాడు. ''అబ్బె. చాలా కాజువల్‌గా అడిగాను'' అన్నాడు.

''అబద్ధం. మీరు కావాలనే అడిగారు. ఆయన లేరన్న విషయం నిన్ననే నా మాటల్లో దొర్లింది. నాతో సాన్నిహిత్యం పెంచుకోవాలనే కదా మీ ప్రయత్నం!''

పోనీ కోపంగా అంటుందా అంటే అదీకాదు – చిరుకోపం అభినయిస్తున్నట్టూ ఉంది.

ఆమె పరిచయక్రమం ఎలాంటిదంటే–

విశాఖ నుండి బైలుదేరి అరకువేలీ అందాలు.... బొర్రాగుహల పురాతన వైభవం చూడాలనే భరత్ బాబు టూరిజం కోరిక అనుకోకుండా ఓ రోజు తీరింది. టూరిజం వాళ్ల లగ్జరీ కోచ్‌లో సీటు బుక్ చేసుకున్నాడు.

తెల్లవారు ఝామున బస్సు బైలు దేరడానికి ముందు మధుమతి హడావిడిగా లగేజీతో ఎక్కింది. అతని పక్కన కూర్చోబోతూ... ఒక్క క్షణం ''ఇఫ్ యూ డోంట్ మైండ్ ఇట్'' అంది... మర్యాద పూర్వకంగా. చిరుజ్వాలల్లా నుదుట పాపిట కుంకుమ బొట్లు!

''భలేవారు. మీ సీటు నెంబరు ఇదయితే నేనె వర్ని వద్దనడానికి. విత్ ప్లజర్'' అన్నాడు.

''థాంక్యూ. నిజానికి మీరు కూర్చొన్న సీటు నెంబర్ 18... మావారి లక్కీ నెంబర్ 9. ఆయన కూర్చోవలసిన సీటు... వస్తేగా?'' అంది నిష్ఠూరంగా. మణికట్టు నుండి మోచేతుల వరకూ రంగు రంగుల గాజులు సందడి చేసాయి.

బస్ కదిలింది. వేగం అందుకుంది.... ఎయిర్ కూల్డ్ వాల్వో బస్సు.

''మీ వారు లేకుండా ఒక్కరే వస్తున్నారే?'' అడిగాడు కుతూహలంగా.

''మీరు మాత్రం! మీ శ్రీమతి లేకుండా టూర్‌కి తెగబడలేదూ?'' అంది ఎంతో కాలంలో ఎరిగిన దానిలా.

''ఇంట్రస్టింగ్! కానీ ఒక విషయం. నాకు శ్రీమతి లేదుగా''.

''అయ్యో పాపం. అర్థమయిందిలెండి'' అంది అకాల మరణం కావొచ్చునన్న భావనతో. అతను అర్థం చేసుకుని తేలిగ్గా నవ్వాడు.

''నాకు పెళ్లి కాలేదు మేడం'' అన్నాడు. ఆమె సందేహం తీరింది. అతను ఒంటరి వాడు.

''వెరీసారీ. పని గట్టుకుని మీ వ్యక్తిగత విషయాలు తెలుసుకునేలా ప్రవర్తించాను'' అంది.

''ఫర్వాలేదు. మీరు మళ్లీ ప్రశ్నించకుండా నేను పెళ్లి చేసుకోని కారణం చెప్పేస్తున్నా. నాకే అనారోగ్యం లేదు. అనాసక్తి వల్ల కాదు. ప్రేమ వైఫల్యం వల్ల కాదు. నేను ఊహించిన రూపురేఖలు మన స్తత్వం కల స్త్రీ ఎదురు పడలేదు''.

''వ్యక్తిగత విషయాలు చెప్పేశారు గాబట్టి జోక్యం చేసుకోక తప్పదు. తగిన స్త్రీ దొరకలేదనేది వట్టి సాకు. క్షమించరాని నేరం. ముందు మీరు తగిన వారో కాదో ఆత్మవిమర్శ చేసుకోండి. మీరను కున్న స్త్రీ తారసపడే సరికి జీవితం తెల్లారిపోతుంది. దరిదాపుల్లో ఆ ఛాయలున్న అమ్మాయిని చేసుకుని కోరుకున్న రీతిలో మలుచుకోవాలి గానీ...''

''అఫ్‌కోర్స్. మీరు చెప్పిందీ నిజమే. అలా అలా జీవితం నిర్లిప్తంగా గడిచిపోయింది''.

ఆమె ''ఎన్ని రోజులు...ఎన్ని పక్షాలు... ఎన్నిమాసాలు...ఎన్ని రుతువులు... కాలాలు... దొర్లిపోయాయి? సరైన సమయంలో జుర్రుకోవలసిన జీవన మాధుర్యం మిస్ అయ్యారు. టూర్‌లో అందమైన భార్యను మిస్ అయ్యారు. నేను నిత్యం నీడలా వెంటాడే మావార్ని మిస్ అయ్యాను. స్ట్రేంజ్ కోయిన్సిడెన్స్! ఊహించనివి ఎన్ని పొందినా అనుకున్నవి మిస్ అవడమే జీవితం'' అంది.

అతనికి బస్ కుదుపుల్లో మధుమతి శరీరం మెత్తగా తగులుతూంది. అతని ఒంటరి బ్రతుక్కి స్త్రీ

స్పర్శ హాయిగా ఉంది. ఆయాచితమైన సౌఖ్యం. ఆమెకి మాత్రం అందులో వింతేమీ లేక... సంకోచమూ లేక... తన ప్రమేయం లేక... తెలీకుండా మెత్తటి స్పర్శ అందించింది.

"ఇప్పటికైనా పెళ్ళి చేసుకోండి. ఆమెని అపురూపంగా చూసుకుంటే జీవితం నూరేళ్ళ పంట. అన్నీ అనుభవించిన దాన్నిగాబట్టి నిబ్బరంగా చెబుతున్నా".

"కరెక్ట్. మించిపోయింది లేదు." ఆమె వంక ఓరగా రహస్యంగా చూసి అన్నాడు. పైకి చెప్పలేని విషయం మరొకటి ఉంది. అతనికి వెతుకుతూ వచ్చిన.. తనకి నచ్చిన ... మాట తీరు మనసు తీరున్న వయసుకి తగిన స్త్రీ తారసపడ్డమే. ఆమే! ఒంటి పరిమళం కూడా సాత్వికం. ఎన్నాళ్ళ నుంచో అన్వేషిస్తున్న పూల తీగ కాలికి తగిలింది. ఆ తీగ అతన్ని నిలబెట్టి ఒళ్లంతా అల్లుకుని అశక్తుణ్ని చేసింది.

'పిచ్చివాడా. ఆమె వివాహిత' అంతరంగం అరిచి గీపెట్టింది. తల విదిలించి చూసుకున్నా... కాస్సేపటికి మళ్లీ మామూలే.

'మనసు కోతి కదా'.

మాటల్లో మధుమతికి మాగన్నుగా నిద్ర పట్టేసింది. సీట్లో వాలుగా హాయిగా పడుకుని సుఖ నిద్రపోయింది. ఆమెని పరిశీలిస్తూ తర్కించుకున్నాడు – భరత్ బాబు 'ఆమెకి భర్తతో ఎడబాటు తాత్కాలికమా? నిరవధికమా? ఒంటరితనం కప్పిపుచ్చుకోవడం కోసం... ఆత్మరక్షణ కోసం... ఈ రకం సంభాషణ ఆయుధమా?'

అరకులోయ చేరిన తరువాత ఇద్దరూ బస్ ఆపినచోటల్లా కొండలు... కోనలు... గుట్టలు... లోయలు... అఘాతాలు... జలపాతాలు... తుప్పలు... అడవులు... చుట్టి తిరిగారు. శిఖరాల్ని అబ్బురంగా చుట్టి కౌగలించుకుని ఆవరించుకున్న మబ్బుల్ని అబ్బురంగా చూసారు. ఓ పక్కఎండ.... మరోవైపు చలి. భరత్‌బాబు ఎయిర్‌బాగ్‌లో శాలువతీసి ఆమెకి చనువుగా కప్పాడు. విరజిమ్మిన విద్యుత్ కాంతిలో వెలుగొందిన బొర్రా గుహలు... చాపరాయి జలపాతం... తాడిగూడ జలపాతం చూసి మరపురాని అనుభూతి పొందారు.

డ్రైవర్ నిర్ణయించిన టైముకి ఇద్దరూ రాక... కొంచెం ఆలస్యం అయ్యేసరికి మిగతా టూరిస్టులు వారివంక ఎర్రగా కొర్రగా చూసేవారు. ఒకసారి భరత్‌బాబు వచ్చినా మధుమతి రావడం పావుగంట ఆలస్యమయింది. అంతా ఆగ్రహోదగ్రులయ్యారు.

"మీ దంపతుల వరుస నచ్చలేదు. చూడాల్సిన స్పాట్స్ ఎన్నో ఉన్నాయి ఎలా?" అని కసురుకున్నాడు డ్రైవర్.

ఆమె సివంగిలా డ్రైవర్ మీదపడి చీల్చి చెండాడుతుందనుకున్నాడు భరత్‌బాబు. అలా జరగలేదు.

అతని చెవిలో వంగి గొణిగింది. 'కెప్టెన్ కె.వి.రావుగారి సతీమణి అయిన నన్ను మీ భార్యగా అంటగడ్తున్నాడు. పోనీ అనుకోనివ్వండి. అన్నంతమాత్రాన మనసు గాయపడడానికి మన మధ్య రావుగారు లేరుగా" అంది కూల్‌గా.

అతన్ని మరో తరహా ఆనందం ఆవరించింది. ఆమెని తన శ్రీమతిగా ఊహించుకుంటే తాత్కాలికమైన అనుభూతితో గుండె పొంగింది. ప్రయాణంలో ఆమె తన భుజం మీద నమ్మకంగా వాలి నిద్రపోవడం మరీ హాయినిచ్చింది. అదీ జరిగిన కథ.

రాంసింగ్ పొగలు గక్కే లెమన్ టీ తెచ్చాడు. ఇద్దరూ సోఫాల్లో ఎదురు బదురుగా కూర్చొని టీ చప్పరించారు. "అద్భుతంగా వుంది. మీకెలా వుంది టీ?" అంది. భుజాలెగరేస్తూ "వెల్. చాలా బావుంది" అనేశాడు. ఆమె కోసం... ఓ రకంగా అక్కడ లేని రావుగారి కోసం మెచ్చుకోక తప్పలేదు. రాంసింగ్ గుబురుమీసం సవరించుకున్నాడు. ఎందుకో అతని చూపులు కరుగ్గా ఉన్నాయి. అనుకోని అతిథి పద్ధతి అతనికి నచ్చలేదు. ఆమెని అతను చూసే విధానం ఊబిలోకి లాగుతున్నట్టుంది.

"మీకు ఇతన్ని సరిగ్గా పరిచయం చెయ్యలేదు కదూ. రాంసింగ్ మాకు చాలా విశ్వాసపాత్రుడు. అమ్మలా అన్నం పెడతాడు. కంటికి రెప్పలా కాచుకుని ఉంటాడు. రావుగారు లేనందుకు ఇతనే లేకపోతే నేను ఏమైపోయేదాన్నో" అంది. అవునన్నట్టు కన్న బిడ్డని చూసుకున్నట్టుగా అతని కళ్లు విప్పారాయి.

"రాంసింగ్. వీరు మనతో కలిసి భోంచేస్తారు. ఆయన కిష్టమయిన క్రాబ్స్ కర్రీ వండిపెట్టు" అంది.

'అరె క్రాబ్స్ కర్రీ తన కిష్టమని ఆమెకెలా తెలుసు?' అంతలోనే 'అది రావుగారి టేస్టు కాబోలు. లక్కీగా కలిసింది' అనుకున్నాడు.

భరత్‌బాబు. అవునూ – కాదూ... అన్నట్టు "అయ్యో... మీకు శ్రమ" అన్నాడు... భోజనానికి ఉండాలని వున్నా... ఆమెతో కలుపుగోలుగా కాలక్షేపం చెయ్యడానికి... సాయంత్రం 'టీ'కి... మొహమాటపెడితే డిన్నర్ కీ... ఆపైన పంట పండితే... సముద్రం సాక్షిగా తన ప్రపోజల్ చెప్పడానికి ... ఊహలు పొడిగించుకుంటూ పోయాడు.

"రాంసింగ్ వంటంటే ఆయన పడి చచ్చిపోతారు" అని నాలిక్కరుచుకుంది. అమంగళం మాట్లాడాననుకుని. ఒక్కక్షణం విస్మయంగా చూసి కిచెన్ వైపు వెళ్లాడు రాంసింగ్.

టీ తాగిన తర్వాత ఆమె "రండి. పైకి వెళ్దాం. టెర్రెస్ మీద కూర్చుని సముద్రం ఆటుపోట్లు చూడవచ్చు" అంటూ లోపల్నుంచి వున్న మెట్లు ఎక్కింది. అతను అనుసరించాడు. టెర్రెస్ మీద పాత కాన్వాస్ అంబ్రెల్లా కింద గార్డెన్ ఛెయిర్స్‌లో కూర్చున్నారు. ఏటవాలుగా ఎండ తగులుతూంది. సముద్రం నురగలు కక్కుతూ ఉరకలు వేస్తూంది. జువ్వి చెట్లు సముద్రపు గాలికి కోసుకుపోతూ ఊగిపోతూ జుయిజుయిమని రొద చేస్తున్నాయి. హోరు గాలి ఒళ్లంతా తడిమి ముంగురుల్ని చిందరవందర చేస్తూంది. భరత్‌బాబు ఆమె ఏం చెబుతుందా అని చెవులు రిక్కించాడు.

"ఇందాక నోరు జారాను. రాంసింగ్ వంటలంటే ఆయన పడి చచ్చిపోతారని చావంటే గుర్తొచ్చింది....

ఒక రాత్రి – ఆయనతో జరిగిన అనుభవం చెబుతా..."

'నేను చనిపోయిన తరువాత నువ్వు తెల్లచీరలు కడతావా? రంగుచీరలు కడతావా' అన్నారు. నేను పక్క మీంచి దిగ్గునలేచి కూర్చున్నాను. ఆయన వంక చూస్తే కళ్లు పత్తికాయల్లా తెరుచుకుని పైకప్పు వంక చూస్తున్నారు 'అవేం మాటలండీ' అన్నాను... గద్గద స్వరంతో.

'మాటలు అలా వుంచు. నువ్వు ఏ చీరలు కడతావు? బొట్టుంచుకుంటావా? గాజులుంచుకుంటావా? ఈ పుస్తెలు... మట్టెలు...' అరిచేత్తో ఆయన పెదాలు మూసి 'పైన తథాస్తు దేవతలుంటారు.

అసలు ఈ టైంలో మెలకువ ఎలా వచ్చింది?'

'నిద్ర పోతే కదా... రాత్రంతా ఆలోచిస్తున్నా'

'గాజులు... చీరల గురించా'

'కాదు నా చావు గురించి. కనుచూపులో ఏదో ముగింపు కనిపిస్తూంది'.

'నిద్రపట్టక పోతే కాసేపు టీవీ చూడండి. లేకపోతే మీ కిష్టమయిన పాత సినిమా డివిడీలు వేస్తాను. ఎంజాయ్ చెయ్యండి... పోనీ 'మిడ్‌నైట్ చిల్డ్రన్' మిగతా పేజీలు చదవండి. సల్మాన్‌రష్దీ ఊహా ప్రపంచం నాకు చూపిద్దురు. నాకు చదివే ఓపిక లేదు' అన్నాను. నా మాటలు చేష్టలు ఆయన్ని ఏ రకంగానూ డైవర్ట్ చెయ్యలేదు. లేచి అటు ఇటూ పడగ్గదిలో పచార్లు చెయ్యసాగారు. ఆలోచనల వేగం లోనే ఆయన అడుగులు పడ్డ



న్నాయి. బెడ్ లైటు బ్లూ వెల్తురు వలలా పరచు కుంది గదిలో. మా ఇద్దరి ఉమ్మడి శరీర పరిమళం గాలిలో కరుగుతూంది.

'ఇంకో ప్రపోజల్! డూ యూ వాట్ మీ?' అని ఆయనకి అడ్డంపడి అందం ఎరవేసాను. నా స్థితిని కొసకంటకూడా చూడకుండా విదిలించేసి మెట్లెక్కి టెర్రెస్ మీదకి వెళ్లారు. వెనకే నేనూ!.''

వింటూ భరత్‌బాబు కర్చీఫ్‌తో నుదురు అద్దుకు న్నాడు. ఆమె సంకోచం లేకుండా చెప్పుకు పోతూంది.

''నా అహం దెబ్బతింది. పదే పదే గింజుకుంటే గానీ... ఒప్పుకోని నేను ఆయన మనసు ఎంగేజ్‌చేసి శరీరం బిజీ చెయ్యాలనుకున్నా. ఆయన తప్పుడు ఆలోచనలకి అడ్డుకట్ట వెయ్యాలనుకున్నా. అమా వాస్య రాత్రి. సముద్రం ఆకాశం కూడ బలుక్కుని ఏకం పాకం అయి చీకటి గుయ్యారంలా వున్నాయి. కెరటాల ఘోష వింటేనే గానీ అది సముద్రం అని తెలీని చీకటి.

చటుక్కున ఆయన వెనక్కి తిరిగి 'నేనున్నా... పోయినా.. కట్టుబొట్టూ అలానే ఉండాలి. తియ్యడా నికి చెరపడానికి వీల్లేదు' అన్నారు.''

ఎందుకో ఆ సంఘటన ... సంభాషణ అసం దర్భం అనిపించింది.

***

సాయం సంధ్య.

సూర్యోదయమే తప్ప సూర్యాస్తమయం ఇటు వైపు కనబడని బంగాళాఖాతంలో కెరటాలు పొరలు పొరలుగా తెరలుతెరలుగా నిలువెత్తై... తాడిఎత్తున వచ్చిపడి తీరాన్ని - గర్భంలో ఉమ్మనీటిలో అమ్మను తన్నినట్టు తన్ని వెనక్కి తగ్గుతున్నాయి. మధుమతి తడి ఇసుకలో కాలుగుచ్చి చుట్టూ పిచ్చుకగూడు కట్టింది. మెల్లగా కాలుతీసి గూడు చూసుకుంది. ఎస్కిమోల గూడుకు నకలు. తృప్తిగా చూసుకుని 'ఇందులో నేను... ఆయనా' అనుకుంది.

అంతకుముందు భోజనాల తర్వాత భరత్‌బా బుని విశ్రాంతి తీసుకోమని రాంసింగ్‌తో హాలు పక్కగదికి పంపించింది. సీ ఫుడ్స్ సుష్టుగా లాగిం చాడేమో.... హాయిగా నిద్ర పట్టేసింది. మెలకువ వచ్చేసరికి సాయంత్రం ఆరు! బైటికి వచ్చి చూస్తే దూరంగా మధుమతి కనిపించింది తీరంలో.

''రాంసింగ్'' అని పిలిచాడు. అతను వచ్చాడు. అదే సరైన సమయం అనుకుని ''రాంసింగ్. నాకో అనుమానం... రావుగారు తిరిగి రాక ఎన్నాళ్ల యింది? ఆర్నెల్లేనా?''

''ఆర్నెల్లు కాదు. ఆరేళ్లయింది''

''అయితే నా అనుమానం నిజమే. ఆయన మధుమతి గార్ని వదిలేసారు''.

రాంసింగ్ కళ్లు ఎర్రబడ్డాయి.

''మీకు అనవసరం. ఈ ఇంటి విషయంలో జోక్యం చేసుకోకండి. ఒకరోజు గెస్టు... ఒక రోజులో వెళ్లండి'' అన్నాడు.

''రాంసింగ్. నేను చెప్పేది పూర్తిగా విను. ఆమె ఒంటరి స్త్రీ. రావుగారు ఆమెని వదిలేసారు. నేను కలిసి జీవించాలనుకున్న స్త్రీ మూర్తి ఈమె. నా అన్వే షణ ఫలించింది''.

''ఆయన వదిలేసారని ఎలా గ్రహించారు?'' అన్నాడు వ్యంగ్యంగా.

''సముద్రంలో పొగగొట్టం కనబడితే చాలు. ఆ షిప్ కెప్టెన్‌రావు గారేనని ఆశ పడ్తూంది. ఇన్నాళ్లు రానివాడు ఇప్పుడెలా వస్తాడు. ఎవరితోనో ఏ దేశం లోనో సెటిలయిపోయాడు. ఆమెని పూర్తిగా మర్చి పోయాడు''.

''అలా ఎందుకనుకుంటున్నారు?''

''ఆమె ప్రవర్తన. సంభాషణ. ఈ ఇంటి పరిస రాలు వాతావరణం అన్నీ నాకు రహస్యం ఛేదించే జ్ఞానం కలిగించాయి''.

''రావు గారంటే ఆమెకు పంచప్రాణాలు. మీరు దగ్గరవ్వాలని చూడకండి''

''నేను ఆమెను పెళ్లిచేసుకుంటాను. జీవితం పొడు గునా తోడు నీడగా ఉంటాను. నువ్వు కూడా మా ఆశ్ర యంలో ఉండవచ్చు'' అన్నాడు ఉద్వేగంగా.

రాంసింగ్ దగ్గరగా వచ్చి ''మీకు తెలీని విషయం ఒకటుంది వినండి. కెప్టెన్ రావుగారు లేరు. చనిపోయారు. కాదు. చంపబడ్డారు'' అన్నాడు. భరత్‌బాబు నిర్ఘాంత పోయాడు.

''మన తీరప్రాంతంలో ప్రవేశించి దేశంలో హత్యాకాండచేసి అరాచకం సృష్టించాలని నలు గురు టెర్రరిస్టులు షిప్‌లో చొరబడ్డారు. వార్ని గుర్తించి షిప్‌ని 'క్రూ'ని రక్షించాలని కెప్టెన్‌రావు గారు తిరబడ్డారు. ఒక్కరూ నలుగుర్ని ఎదిరించి పోరాడారు. పిట్టల్నికాల్చినట్టు కాల్చి చంపారు... తాను చనిపోతూ. వాళ్లు చని పోయేముందు రావు గార్ని సముద్రంలోకి విసిరేసారు. షార్క్ చేపలకి ఆహారం అయ్యారు గానీ శరీరం దొరకలేదు'' అన్నాడు రాంసింగ్.

''ఆమెకీ విషయం తెలుసా?''

''ఆ మాటెత్తితే ఆమె విరుచుకు పడుతుంది. 'ఆయనకి మరణం లేదు. బతికే వుంటారు' అంటుంది. ఇలాంటి పరిస్థితిలో ఆమె నుంచి ఏమి ఆశిస్తారు?''

జవాబివ్వకుండా... రాంసింగ్ వారిస్తున్నా భర త్‌బాబు ఇసుక పర్రల్లో అడుగులు వడివడిగా వేసి ఆమెను చేరాడు. కెరటాల తుంపర్లు ఆమె మొహం మీద ముత్యాలు పోసాయి.

భరత్‌బాబు మొహంలో ఆందోళన చూసి మధు మతి విషయం గ్రహించింది.

''రాంసింగ్ అంతా చెప్పేశాడా?'' అంది. తలూ పాడు. ఆమె వంక దీనవదనంతో అభ్యర్థనగా ఏదో చెప్పబోయాడు.

''నేనెవరో ఏమిటో ఇప్పటికైనా తెలిసింది కదా''.

''వాస్తవం గ్రహించండి మధుమతీ. లేని మనిషి కోసం నిరీక్షణ కట్టిపెట్టండి''.

''మళ్లీ అదే మాట.'' గాజుల చేతులు గాల్లోకి లేపి ''ఆయన లేరని ఎవరన్నారు. నా ఊహల్లో జీవించే ఉన్నారు'' అంది.

''పసుపు కుంకుమలు నిలుపుకోవాలన్న కోరిక తీరే విధానం ఇదికాదు. మనం ఒకటయితే అది నిజ మవుతుంది. మీరు నిత్య సుమంగళి అవుతారు''.

మధుమతి పేలవంగా నవ్వింది.

భర్త మరణంతో ఒకసారి పసుపు కుంకుమలు చెరుపుకుని పునర్వివాహంతో మళ్లీ పులుముకో వడం నా దృష్టిలో ఆత్మవంచన.

ఆమె చేతిని తమకంగా తన చేతుల్లోకి తీసుకుని ''అంతేనా?'' అని ప్రాధేయ పడ్డాడు.

''భార్య ఊహల్లో భర్త సజీవంగా ఉన్నంత కాలం పసుపు కుంకుమలతో కళకళ లాడేలా కట్టు బొట్లు మార్పించండి. మీరు మరో అభాగినికి అవ కాశం ఇస్తే నేను నిత్య సంతోషినవుతా'' అంది చెయ్యి మృదువుగా లాక్కుంటూ.

తీరం చేరే కెరటాలు అంతెత్తున లేచి విరగబడి తిరగబడుతున్నాయి.

*

రచయిత సెల్ నెం :94915 76399



## కరీనాకు దీపిక చురకలు...

ఇటీవలి కాలంలో బాలీవుడ్ అందాల భామలు కరీనాకపూర్, దీపికా పదుకొనేకు పడుతున్నట్లు కని పించడం లేదు. ఈ ఇద్దరు భామలూ అవకాశం దొరికినప్పుడల్లా ఒకరి మీద మరొకరు మాటలతో యుద్ధం చేసుకుంటూనే ఉన్నారు. ఈ నేపథ్యంలో దీపిక డైరెక్ట్‌గా కాకపోయినా, ఇండైరెక్ట్‌గా కరీనా జీరో సైజ్ మీద మాటల బాణాలు వదిలింది. ''భారతీయ స్త్రీ అంటే వంపుసొంపులకు, అందమైన ఆకృతికి ప్రతీక. ఇక్కడి వాతావరణానికి జీరోసైజు అస్సలు సరిపడదు. భారతీయ మహిళ అందచందాలకి ప్రప పంచమంతా దాసోహమంటుంటే, మనం మాత్రం 'జీరోసైజ్ ఫిజిక్' కోసం వెంపర్లాడుతున్నాం. నా మటుకు నాకు జీరో సైజ్ అంటే అస్సలు ఇష్టం ఉండదు'' అంటూ పరోక్షంగా కరీనా జీరోసైజు మీద విరుచుకు పడింది. మరి దీనికి కరీన ఏం జవాబు చెబుతుందో వేచి చూడాల్సిందే!